క్లుప్తంగా

స్వాతంత్ర్య సమరయోధుడు మృతి


వెంకట్‌రెడ్డి (ఫైల్)

కేతేపల్లి: మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు, శతాధిక వృద్ధుడు, మాజీ సర్పంచ్ బుర్రి చినవెంకట్‌రెడ్డి(103) గురువారం రాత్రి మృతి చెందాడు. ఈయన భారతదేశ స్వాతంత్ర్యం కోసం జరిగిన పోరాటంలో పాల్గొని పలుమార్లు జైలు జీవితం గడిపారు. 1971-1983 వరకు పన్నెండేళ్ల పాటు ఉమ్మడి కేతేపల్లి(కొత్తపేట, చీకటిగూడెం కలిపి) గ్రామాలకు సర్పంచ్‌గా పని చేశారు. వెంకట్‌రెడ్డికి ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. వృద్ధాప్యంలో హైదరాబాద్‌లోని తన కుమారుల వద్ద ఉంటున్నారు. వెంకట్‌రెడ్డి మృతదేహానికి అంత్యక్రియలను కుటుంబ సభ్యులు అక్కడే నిర్వహించారు. వెంకట్‌రెడ్డి మృతి పట్ల వివిధ పార్టీల నేతలు, గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు.

ఆర్థికసాయం అందజేత

చిట్యాల: పట్టణానికి చెందిన గండమల్ల శ్రీను ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి చిట్యాల మండల పెయింటర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సేకరించిన రూ.13 వేలను శుక్రవారం అందజేశారు.
శాలిగౌరారం: మండల కేంద్రంలో ఇటీవల వ్యవసాయ బావివద్ద విద్యుదాఘాతానికి గురై మృతిచెందిన జోగు మల్లయ్య కుటుంబానికి శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో రూ.20 వేల నగదును శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో హమాలీ యూనియన్ అధ్యక్షుడు బట్ట శ్రీను, ఉపాధ్యక్షుడు నిమ్మల యాదయ్య, కార్యదర్శి బండారు శేఖర్, ప్రతినిధులు పాల్గొన్నారు.

పాఠశాలకు వితరణ

నల్లగొండ టౌన్: సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా వైఆర్‌పీ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎలిశాల రవిప్రసాద్ శుక్రవారం సూర్యకిరణ్ మానసిక వికలాంగుల పాఠశాలకు బియ్యం, ఇతర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో నాగలక్ష్మి, శైలజ, వరలక్ష్మి, రాజు, దేవేందర్, రూప, రమేష్, భవాని పాల్గొన్నారు.

కుర్చీలు బహూకరణ

మర్రిగూడ: మండలంలోని మేటిచందాపురంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనానికి గ్రామస్తుడు ఏరుకొండ అబ్బయ్య పది కుర్చీలను అందజేశారు. ఈ సందర్భంగా అబ్బయ్యను గ్రామస్తులు సన్మానించారు. పంచాయతీ కార్యదర్శి మల్లేష్, నామాపురం ఎంపీటీసీ ఊరిపక్క సరితనగేష్, మాజీ సర్పంచ్ జంగిలి లక్ష్మీప్రసన్నరవి, గ్రామస్తులు ఏరుకొండ నరేష్, పగిళ్ల శంకర్, ఏరుకొండ లింగస్వామి, నాగబండి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి

నల్లగొండ రూరల్: ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని స్థానిక మహిళా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ దేవవాణి అన్నారు. శుక్రవారం కళాశాలలో ఎయిడ్స్ నియంత్రణపై నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. 2030 నాటికి ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ రాజారాం, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ సరిత, శైలజ, వనజ, అధ్యాపకులు స్వామి, మట్టయ్య, కొండానాయక్, నవీన్, ప్రవీణ్, సుధాకర్, సంపతయ్య పాల్గొన్నారు.

కేరళ ప్రభుత్వంపై నిరంకుశ ధోరణి మానుకోవాలి

చండూరు: కేరళ ప్రభుత్వం పట్ల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిరంకుశ ధోరణితో వ్యవహరించడం మానుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం అన్నారు. శుక్రవారం సీపీఎం చండూరు మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి మొగుదాల వెంకటేశం, మండల సహాయ కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ గౌడ్, మండల కమిటీ సభ్యుడు కొత్తపల్లి నరసింహ, కంచర్ల రవి, గౌసియా బేగం పాల్గొన్నారు.

జిల్లాస్థాయికి ఎంపిక


జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులు

శాలిగౌరారం: జాతీయ సైన్స్ సంబరాల్లో భాగంగా మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి పోటీలు జరిగాయి. మండలంలోని పలువురు విద్యార్థులు ప్రతిభ కనబర్చి జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. పెర్కకొండారం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన డి.నందు(డ్రాయింగ్), ఎస్.ప్రవళిక(కవిత్వం), శాలిగౌరారం గీతాంజలి ఉన్నత పాఠశాలకు చెందిన జి.ప్రత్యూష (పాటలు), శాలిగౌరారం కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయంకు చెందిన బి.తేజస్విని(ఉపన్యాసం) జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ మండల విద్యాధికారి ఎం. నాగయ్య, మండల నోడల్ అధికారి ఎం.సైదులు తదితరులు పాల్గొన్నారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

‘మహాలక్ష్మి’లో తప్పుల సవరణకు సర్వే

- సవరణలకు అవకాశం ఇచ్చిన ప్రభుత్వం
- నీలగిరిలో 13 వేల దరఖాస్తుల్లో తప్పులు
- వివరాలు సేకరిస్తున్న మున్సిపల్ సిబ్బంది



నల్లగొండ టూటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలని భావిస్తున్న ఆరు గ్యారంటీల పథకాల్లో భాగంగా మహాలక్ష్మి స్కీం దరఖాస్తుల్లో తప్పులు దొర్లాయి. నీలగిరి మున్సిపాలిటీ పరిధిలోని 48 వార్డుల్లో మొత్తం 47,098 మంది ఆరు గ్యారంటీ పథకాలకు దరఖాస్తు చేస్తుకున్నారు. మహాలక్ష్మి పథకంలో రూ.500 లకే గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వం అందజేయనుంది. అయితే నల్లగొండ పట్టణంలోని 13 వేల మంది దరఖాస్తుదారులకు చెందిన గ్యాస్ ఏజెన్సీల పేర్లు, కంజ్యూమర్ నంబర్లు తప్పుగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దాంతో ఇప్పుడు ఈ 13 వేల మంది లబ్ధిదారుల గ్యాస్ ఏజెన్సీల పేర్లు, కంజ్యూమర్ నంబర్లను మున్సిపల్ సిబ్బంది సేకరిస్తున్నారు. ఈ రెండింటికి మాత్రమే ప్రభుత్వం సవరణకు అనుమతిచ్చింది. రెండు రోజుల్లోగా 13 వేల మందికి చెందిన గ్యాస్ ఏజెన్సీల పేర్లు, కంజ్యూమర్ నంబర్లను సేకరించి ప్రభుత్వం చెప్పిన యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. దీంతో ఆగమేఘాల మీద లబ్ధిదారుల వివరాలు సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

వివరాలు అందకుంటే వినియోగదారులకు నష్టం

ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం వార్డుల వారీగా సభలు పెట్టి ఆరు గ్యారంటీల అమలు కోసం ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. కానీ కొందరికి సరైన అవగాహన లేని కారణంగా గ్యాస్ ఏజెన్సీ కంజ్యూమర్ నంబర్లు తప్పుగా నమోదు చేసినట్లు తెలుస్తోంది. అదేవిధంగా ఆన్‌లైన్ చేసే సమయంలో కూడా దరఖాస్తుల్లోని వివరాలను తప్పులుగా నమోదు చేసినట్లు అధికారులు భావిస్తున్నారు. ఈ 13 వేల మందికి సంబంధించి గ్యాస్ కనెక్షన్ వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేస్తేనే రూ.500 లకు గ్యాస్ సిలిండర్ అందనుంది. వివరాలు సేకరించడంలో ఏమాత్రం ఆలస్యం అయినా వినియోగదారులు రూ.500 గ్యాస్ సిలిండర్ కోల్పోయే అవకాశం ఉంది. ఈ రెండు రోజుల్లో ఇంత మంది వివరాలు సేకరించి యాప్‌లో ఆన్‌లైన్ చేయడం కష్ట సాధ్యమనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. వివరాల సేకరణ కోసం మరో మూడు రోజుల పాటు గడువు ఇస్తే వినియోగదారుల వివరాలు పూర్తిగా సేకరించి అప్‌లోడ్ చేయడానికి అవకాశం ఉంటుంది. లేకుంటే 13 వేల మందిలో సగం మంది లబ్ధిదారులు రూ. 500 గ్యాస్ సిలిండర్ కోల్పోయే పరిస్థితులు ఏర్పడుతాయి.

వివరాలు సేకరిస్తున్నాం

గ్యాస్ ఏజెన్సీ కంజ్యూమర్ నంబర్లు తప్పుగా నమోదు చేసినవారి వివరాలు సేకరిస్తున్నాం. శని వారం రాత్రిలోగా వివరాలు సేకరించి యాప్‌లో అప్‌లోడ్ చేస్తాం.

– సయ్యద్ ముసాబ్ అహ్మద్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

నల్లగొండక్రైం: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం డీఎస్పీ లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో సైబర్ మోసాలు-అప్రమత్తత అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్ల పంపే లింక్‌లకు, మెసేజ్‌లకు స్పందించవద్దని సూచించారు. టెక్నాలజీ ఉపయోగించుకుని నేరగాళ్ల కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా తెలియని వ్యక్తులకు ఫ్రెండ్ రిక్వెస్టు చేయడం, దాన్ని అంగీకరించడం చేయవద్దన్నారు. మోసానికి గురైతే 1930, 155260, 8712665575, 8712665625 హెల్ప్‌లైన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో షీటీం ఎస్‌ఐ విజయలక్ష్మీ, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే వాహనదారులంతా సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకుంటారని సైబర్ క్రైం డీఎస్పీ, నల్లగొండ ఇన్‌చార్జ్ డీఎస్పీ లక్ష్మీ నారాయణ అన్నారు. శుక్రవారం 35వ జాతీయ భద్రతా వారోత్సవాలను జిల్లా కేంద్రంలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. అకస్మాత్తుగా వాహనాలు నిలుపడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్, ఓవర్‌స్పీడ్, రాంగ్‌రూట్‌లో ప్రయాణం, ఓవర్ టేక్, హెల్మెట్ లేకుండా, సీటు బెల్టు లేకుండా, మద్యం తాగి వాహనాలు నడుపుతున్న కారణంగానే 22 నుంచి 35 ఏళ్ల మధ్య యువకులు మృతి చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనాలు పక్కకు తీసుకునేటప్పుడు సిగ్నల్ ఇవ్వాలని అకస్మాత్తుగా ఆపడం ద్వారా వెనుక వచ్చే వాహనాలు ముందున్న వాహనాలను ఢీకొనే అవకాశం ఉందన్నారు. ఒక ప్రాణం పోతే ఆ కుటుంబంలో అంధకారం నెలకొంటుందన్నారు. ఆర్థికంగా చితికిపోవడంతో వారి జీవన మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ దానియెల్, టూటౌన్ సీఐ కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

అధికారులకు తప్పుడు సమాచారం ఇవ్వొద్దు


మునుగోడు : కొరటికల్‌లో సర్వే వివరాలు పరిశీలిస్తున్న చండూరు ఆర్డీఓ దామోదర్‌రావు

మునుగోడు: ప్రభుత్వం అందించనున్న ఆరు గ్యారంటీల సబ్సిడీలకు అధికారులకు పూర్తి సమాచారం అందించాలని, ఎవరైనా తప్పుడు సమాచారం అందిస్తే సబ్సిడీలు అందవని చండూరు ఆర్డీఓ దామోదర్‌రావు అన్నారు. మహాలక్ష్మి పథకం గ్యాస్ సబ్సిడీకి గ్యాస్ నంబర్లను సేకరించేందుకు అధికారులు మండలంలో ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటుచేశారు. ఆ టీమ్ సభ్యుల పనితీరును శుక్రవారం మండలంలోని గూడపూర్, కొరటికల్, దుబ్బకాల్వ గ్రామాల్లో ఆర్డీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న అనేక మంది గ్యాస్ కనెక్షన్ నంబర్ సరైంది ఇవ్వకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. సమస్యను పరిష్కరించేందుకు అధికారులు ఇంటింటికీ తిరిగి సరైన గ్యాస్ కనెక్షన్ నంబర్ సేకరిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ నరేందర్ తదితరులు ఉన్నారు.

గ్యాస్ వివరాలు త్వరితగతిన పూర్తి చేయాలి

మర్రిగూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా రూ.500కే గ్యాస్ కనెక్షన్‌లో వివరాలను సవరించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్ బక్క శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండలంలోని శివన్నగూడ గ్రామంలో గ్యాస్ కనెక్షన్ల వివరాలను సరిచేయడంపై బీఎల్‌వోలకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దాసరి మమత గోపాల్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ, బీఎల్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి


నల్లగొండ టౌన్ : సమావేశంలో మాట్లాడుతున్న పల్లా దేవేందర్‌రెడ్డి

నల్లగొండ టౌన్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెలో ప్రజలు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని నిరుద్యోగులను మోసం చేసిన నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని ఓడించేందుకు ప్రజలు, నిరుద్యోగులు, కార్మికవర్గాలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి, ఉపాధ్యక్షుడు పాణెం వెంకట్రావ్, ఎండీ సయీద్, సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు, బరిగల వెంకటేశ్, జిల్లా కోశాధికారి దొనకొండ వెంకటేశ్వర్లు, విశ్వనాథుల లెనిన్ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రం

నల్లగొండ: కేంద్ర ప్రభుత్వం కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అంబటి సోమయ్య, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి ఆరోపించారు. నల్లగొండలోని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో జాయింట్ ప్లాట్‌ఫామ్‌ఆఫ్ ట్రేడ్ యూనియన్లన్నీ పాల్గొంటాయని తెలిపారు. ఈ సమావేశంలో ఐఎన్‌టీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండీ మొయినుద్దీన్, పల్లా దేవేందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, సుంకిశాల వెంకన్న, అవుట రవీందర్ పాల్గొన్నారు.

భారత్ బంద్‌ను జయప్రదం చేయాలి

నకిరేకల్ : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16 జరగనున్న గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి అయిలయ్య కోరారు. నకిరేకల్‌లో సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ఉపాధి హామీ చట్టం రక్షణ కోసం జరిగిన రౌండ్ టెబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ యాతాకుల అంజయ్య, నాయకులు రాచకొండ వెంకట్‌గౌడ్, బచ్చుపల్లి ప్రకాష్‌రావు, చింతపల్లి లూర్దు మారయ్య, వంటిపాక కృష్ణ మక్కబుచ్చిరాములు, కందికంటి జానయ్య, నీలం సైదులు, వంగూరు వెంకన్న, డెంకల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కందాల ప్రమీల అన్నారు. మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర రైతు సంఘం మండల కమిటీ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చలకాని మల్లయ్య, మండల అధ్యక్షుడు సైదుల శ్రీను, కార్యదర్శి నూనె గట్టయ్య, కల్లూరి లింగయ్య, డెంకల లింగయ్య, గద్దపాటి అరవింద్, దాసరి దేవచిత్తం, అన్నెబోయిన కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిదేళ్లు నియంత పాలన సాగింది

- అసెంబ్లీలో నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్ : రాష్ట్రంలో గత తొమ్మిదేళ్లు నియంత పాలన సాగిందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శుక్రవారం శాసన సభ బడ్జెట్ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఆయన ప్రసంగించారు. నకిరేకల్‌లో నియోజకవర్గంలో 126 గ్రామాలు ఉంటే మెజార్టీ గ్రామాలకు మిషన్ భగీరథ నీరు అందడం లేదన్నారు. దివంగత సీఎం వైఎస్సార్ చేపట్టిన ప్రాజెక్టులను బీఆర్ఎస్ నేతలు నిర్వీర్యం చేశారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమకారులను విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రగతి భవన్ వద్ద ఎర్రటి ఎండలో మూడు గంటల పాటు నిరీక్షించిన గద్దర్‌కు అప్పటి సీఎం కేసీఆర్ అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదని అన్నారు.

గావ్ చలో.. బస్తీ చలో

నకిరేకల్ : మండలంలోని తాటికల్ గ్రామంలో శుక్రవారం గావ్ చలో.. బస్తీ చలో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ అమలుచేస్తున్న కార్యక్రమాలను బీజేపీ నాయకులు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి మండల వెంకన్న, గుడుగుంట్ల సాయన్న, చనగాని రాములు, సీత, అంజి, బండమీది శ్రీకాంత్, కారింగ్ శ్రీను, గోపి, సురేష్, లక్ష్మయ్య, దూదిమెట్ల లింగయ్య, రమేష్ పాల్గొన్నారు.

చెర్వుఅన్నారంలో..

కట్టంగూర్ : గావ్ చలో బస్తీ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు శుక్రవారం మండలంలోని చెర్వుఅన్నారం గ్రామంలో కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు ముడుసు భిక్షపతి, శ్రీను, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై అవగాహన

చండూరు: మండల కేంద్రంలోని సన్ షైన్ పాఠశాల, గాంధీజీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో కుష్టు వ్యాధి నిర్మూలనపై జిల్లా పారా మెడికల్ అధికారి ఆరిఫ్, మహమ్మద్ అనీఫ్, చంద్రశేఖర్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాసరాజు శుక్రవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సన్ షైన్ పాఠశాల కరెస్పాండెంట్ కోడి వెంకన్న, డైరెక్టర్ కోడి సుష్మ, డాక్టర్ మాస రాజు, నర్సింగరావు, ప్రిన్సిపాల్ రవికాంత్, లతీఫ్ పాషా, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు, గాంధీజీ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు, డైరెక్టర్ సరికొండ వెంకన్న, ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి, వి.వి. నరసింహారావు, ఏఎన్ఎం సౌజన్య, ఆశా వర్కర్లు నాగమణి, జ్యోతి, సంతోషి, దుర్గా, తురుణి, అంగన్‌వాడీ టీచర్స్ సునీత, కేదారి, విజయనిర్మల, జగదీశ్వరి, అస్మా బేగం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సభను విజయవంతం చేయాలి


నల్లగొండ టూటౌన్ : సభ స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, తదితరులు


చండూరులో మాట్లాడుతున్న కూసుకుంట్ల

నల్లగొండ టూటౌన్: ఈ నెల 13న నల్లగొండ పట్టణం మర్రిగూడ బైపాస్ సమీపంలో నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ బహిరంగ సభకు ప్రజలు భారీగా తరలిరావాలని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి కోరారు. శుక్రవారం నల్లగొండలోని వీటీ కాలనీలో నిర్వహించిన నల్లగొండ పట్టణ బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, ఎన్నో ఉద్యమాలు చేసి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం సాధిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను కుట్రపూరితంగా కేంద్రానికి అప్పగించిందని అన్నారు. అనంతరం బహిరంగ సభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సభ సమన్వయకర్త రవీందర్‌సింగ్, మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, రేగట్టె మల్లికార్జున్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ చీర పంకజ్‌యాదవ్, కటికం సత్తయ్యగౌడ్, సింగం రామ్మోహన్, సింగం లక్ష్మి, మాలె శరణ్యారెడ్డి, బక్క పిచ్చయ్య, జమాల్ ఖాద్రీ, యామ దయాకర్, సుధాకర్, మారగోని గణేశ్‌గౌడ్, యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

సభ ఏర్పాట్లు పరిశీలించిన మాజీ ఎమ్మెల్యేలు

నల్లగొండ పట్టణంలోని మర్రిగూడ బైపాస్ రోడ్‌లో ఈ నెల 13న బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బహిరంగ సభ ఏర్పాట్లను శుక్రవారం మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, చంటి క్రాంతికిరణ్, శానంపూడి సైదిరెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, బోనగిరి దేవేందర్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, జనార్దన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సభను జయప్రదం చేయాలి

చండూరు: ఈ నెల 13న నిర్వహించనున్న చలో నల్లగొండ బహిరంగ సభను జయప్రదం చేయాలని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం చండూరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో చండూరు, గట్టుప్పల మండలాలకు సంబంధించి బీఆర్ఎస్ ముఖ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని నమ్మి అధికారమిస్తే ప్రజల హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. నీళ్ల కోసమే మొదటి నుంచి పంచాయితీ నడుస్తోందని, విభజన చట్టంలోని హామీల్లో భాగంగా కేంద్రానికి ప్రాజెక్టులు అప్పగించాల్సి ఉన్నప్పటికీ వాటా తేల్చనిదే కేంద్రానికి అప్పగించేది లేదని మాజీ సీఎం కేసీఆర్ తేల్చి చెప్పారన్నారు. చలో నల్లగొండ సభ మునుగోడు ఇన్‌చార్జ్ నందికంటి శ్రీధర్ మాట్లాడుతూ ఈ సభ పార్టీకి సంబంధించిని కాదని, ప్రజలందరిదీ అన్నారు. కల్లు గీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్, చండూరు పట్టణ, చండూరు, గట్టుప్పల మండలాల అధ్యక్షులు బొమ్మరబోయిన వెంకన్న, భూతరాజు దశరథ, ఇడెం కైలాష్, చండూరు మున్సిపల్ చైర్పర్సన్ తోకల చంద్రకళ వెంకన్న, జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, ఎంపీపీ పల్లె కళ్యాణి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

నీటిని అందించేందుకు కేసీఆర్ చొరవ

మర్రిగూడ: మునుగోడు ప్రాంతంలో ఫ్లోరైడ్ బాధలను చూసి తాగునీటితోపాటు సాగునీరు అందించేందుకు చొరవ చూపిన వ్యక్తి మాజీ సీఎం కేసీఆర్ అని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నాంపల్లి, మర్రిగూడ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు ప్రభుత్వం కేఆర్ఎంబీకి అప్పగించడాన్ని నిరసిస్తూ ఈ నెల 13న తలపెట్టిన చలో నల్లగొండ సమావేశాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం చలో నల్లగొండ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి, సమావేశ ఇన్‌చార్జ్ శ్రీధర్, మాల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దంటు జగదీశ్వర్, బచ్చు రామకృష్ణ, తోటకూరి శంక తదితరులు పాల్గొన్నారు.

చలో నల్లగొండను జయప్రదం చేయాలి

శాలిగౌరారం: ఈ నెల 13న నల్లగొండలో జరుగనున్న బీఆర్ఎస్ పార్టీ బహిరంగ సభను జయప్రదం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్న అన్నారు. మండల కేంద్రంలోని శుక్రవారం బీఆర్ఎస్ కార్యాలయం వద్ద బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. సింగిల్‌విండో చైర్మన్ తాళ్లూరి మురళి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుజిలాల్ శేఖర్‌బాబు, చాడ హతీష్‌రెడ్డి, కట్ట వెంకట్‌రెడ్డి, గుండా శ్రీనివాసులు, మామిడి సర్వయ్య, గంట శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పీవీకి భారత రత్న ఇవ్వడం హర్షణీయం



నల్లగొండ టూటౌన్ : సమావేశంలో మాట్లాడుతున్న నూకల నరసింహారెడ్డి

నల్లగొండ టూటౌన్: భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం అత్యున్నత పురస్కారం భారత రత్న ఇచ్చి గౌరవించడం హర్షణీయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నూకల నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగు వ్యక్తి పీవీకి భారత రత్న పురస్కారం ఇచ్చిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బీజేపీ నాయకులు స్వీట్లు తినిపించుకున్నారు. ఈ సమావేశంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పోతెపాక సాంబయ్య, అసెంబ్లీ కన్వీనర్ దాయం భూపాల్‌రెడ్డి, పాశం శ్రీనివాస్‌రెడ్డి, పెరిక మునికుమార్, మేకల అనిల్, శాంతి స్వరూప్ పాల్గొన్నారు.

పీవీకి భారత రత్న ఇవ్వడం గర్వకారణం

దివంగత ప్రధానమంత్రి పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారత రత్న పురస్కారం ఇవ్వడం తెలంగాణ ప్రజలకు ఎంతో గర్వకారణమని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ బలోపేతం చేసిన గొప్ప వ్యక్తి పీవీ అని కొనియాడారు. పీవీకి భారత రత్న ఇవ్వాలని 2020లో శాసనసభలో మాజీ సీఎం కేసీఆర్ తీర్మానం చేశారని తెలిపారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

చండూరు: భారత మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావుకు దేశ అత్యున్నత పురస్కారం భారత రత్న అవార్డు ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి శుక్రవారం చండూరు మండల బీజేపీ నాయకులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోమటి వీరేశం, బొబ్బల మనోహర్‌రెడ్డి, మంచుకొండ రామ్మూర్తి, సోమ నరసింహ, ముదిగొండ అంజి, నకరకంటి లింగస్వామి, పట్టణ ప్రధాన కార్యదర్శి తడకమల్ల శ్రీధర్, పందుల సత్యం గౌడ్, పద్సనబోయిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వరిసాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


మాట్లాడుతున్న ఏఓ బి.పురుషోత్తం

కేతేపల్లి: వరినారు సాగులో రైతులు సకాలంలో సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టి తెగుళ్ల బారి నుంచి పంటను కాపాడుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి.పురుషోత్తం సూచించారు. వరిసాగులో చేపట్టాల్సిన సస్యరక్షణపై శుక్రవారం కేతేపల్లిలోని రైతువేదికలో రైతులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం పిలక దశలో ఉన్న పొలాలను కాండం తొలుచు పురుగు ఆశించిట్లుగా గుర్తించామన్నారు. దీని నివారణకు 2 గ్రాముల కార్టోఫైడ్రోక్లోరైడ్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ లేదా ఎకరాకు 10 కిలోల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు వేసుకోవాలని సూచించారు. ఆకులపై కండె ఆకారంలో మచ్చలు ఉన్నట్లయితే అగ్గి తెగులుగా గుర్తించి నివారణకు 0.6 గ్రాముల ట్రైసైక్లజోల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. సమావేశంలో ఏఈఓలు బాలరాజు, వీరేష్, ఉమేష్, పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగు చేపట్టాలి


మాట్లాడుతున్న విద్యాసాగర్

నకిరేకల్ : ఆయిల్ పామ్ సాగును రైతులు విస్తృతంగా చేపట్టాలని వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీధర్‌రెడ్డి, ఉద్యానవన శాఖ నియోజకవర్గ అధికారి రావుల విద్యాసాగర్ కోరారు. నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామంలోని రైతు వేదికలో శుక్రవారం ఆయిల్ పామ్, మిరప పంటల సస్యరక్షణ చర్యలపై జరిగిన క్లస్టర్ లెవల్ అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. ఆయిల్‌పామ్ సాగుపై ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందన్నారు. ప్రతి ఏటా ఎకరాకు రూ.4200 రాయితీ అందిస్తోందన్నారు. మిరప తోటలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, ఎండకాలంలో వేయాల్సిన కూరగాయల పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జానిమియా, ఎంపీటీసీ ఇమడపాక లక్ష్మీవెంకన్న, ఆయిల్‌పామ్ కంపెనీ ప్లాంటేషన్ మేనేజర్ నరేందర్, క్లస్టర్ ఇన్‌చార్జ్ వల్లపు నాగరాజు, పతంజలి కంపెనీ ప్రతినిధులు రామకృష్ణ, రాము, శ్రీను, రైతులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లకు భారీగా దరఖాస్తులు

మునుగోడు: మండలంలోని 7 రేషన్ దుకాణాల డీలర్ల నియామకానికి అభ్యర్థులు భారీగా దరఖాస్తు చేసుకున్నారు. ఖాళీగా ఉన్న 2 దుకాణాల డీలర్లతోపాటు నూతనంగా మంజూరైన 5 దుకాణాలకు అధికారులు ఇటీవల రిజర్వేషన్ల వారీగా దరఖాస్తులు కోరగా 120 మంది దరఖాస్తు చేసుకున్నారు. చల్మెడ గ్రామంలో రేషన్ దుకాణానికి 21 మంది, చొల్లేడు-31, లక్ష్మీదేవిగూడెం-31, రావిగూడెం-5, గుండ్లోరిగూడెం-1, గంగోరిగూడెం-13 , బీరేల్లిగూడెం-18 చొప్పున దరఖాస్తులు వచ్చాయి. వీరికి ఈ నెల 15న చండూరులో రాత పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష పత్రంలో మొత్తం 80 మార్కుల ప్రశ్నలు ఉండగా అందులో 32 మార్కులు సాధించినవారిని ఇంటర్వ్యూలకు ఎంపిక చేస్తారు. ఇంటర్వ్యూలో 20 మార్కులు ఉంటాయని అధికారులు పేర్కొన్నారు.

అన్నదానం

నల్లగొండటౌన్: అమావాస్య సందర్భంగా వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం రోగుల కుటుంబ సభ్యులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ యామ కవితాదయాకర్, గుండా రమేష్‌బాబు, బండారు వెంకటేశ్వర్లు, రేపాల భద్రాద్రి రాములు, వనమా గోపి కిషన్, శోభారాణి, గుండా భవాని, బండారు జ్యోతి, గుబ్బ సత్యనారాయణ, వనమా నర్సింహ, గుబ్బ లీలారాణి, శోభారాణి, గజవెల్లి సత్యయ్య, యాదయ్య, కాసం వెంకన్న, రమేష్ పాల్గొన్నారు.
నకిరేకల్ : వాసవి వనితా క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ బ్రహ్మదేవర పద్మాకృష్ణమూర్తి సహకారంతో శుక్రవారం నకిరేకల్‌లో అన్నదానం చేశారు. దాతలు పబ్బతి వెంకన్న, వీర్లపాటి సంధ్య, క్లబ్ అధ్యక్షురాలు వాడకట్టు రాధిక, ప్రతినిధులు ఎస్.శ్రీలత, ఉప్పల వెంకటరమణ, దేవరశెట్టి సత్యనారాయణ, మంచుకొండ సోమయ్య, ఉప్పల రమేష్, నరేందర్ పాల్గొన్నారు.
నార్కట్‌పల్లి : మండల కేంద్రంలోని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శుక్రవారం అమావాస్య సందర్భంగా తరునోజు నరసింహాచారి జ్ఞాపకార్థం ఆయన సతీమణి కళమ్మ మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బైరోజు సంధ్యారాణి-సతీష్‌చారి, చొల్లేటి తేజశ్రీ-అశోక్‌చారి పాల్గొన్నారు.

చెర్వుగట్టులో లక్ష పుష్పార్చణ

నార్కట్‌పల్లి : చెర్వుగట్టు గ్రామంలో గల శ్రీపార్వతి జడల రామలింగేశ్వర స్వామి ఆలయం శుక్రవారం రాత్రి భక్తులతో కిక్కిరిసిపోయింది. అమావాస్య కావడంతో జిల్లాలోని వివిధ ప్రాంతల నుంచి భక్తులు ఆలయానికి వచ్చారు. ఆలయంలో ప్రధాన అర్చకులు పోతులపాటి రామలింగేశ్వరశర్మ, సతీష్‌శర్మ, సురేష్‌శర్మ, శ్రీకాంత్‌శర్మ వేద మంత్రాలతో లక్ష పుష్పార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ నవీన్‌కుమార్ పర్యవేక్షణలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ శాఖ సిబ్బంది, పోలీసులు తగు చర్యలు తీసుకున్నారు.

క్లుప్తంగా

బాలుడి ఆచూకీ కోసం గాలింపు

భువనగిరి క్రైం : పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా ఈనెల 5న తప్పిపోయిన ఆరు సంవత్సరాల సిద్దిరాములు ఆచూకీ కోసం పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. నిజామాబాద్ జిల్లా రాతాల రాంరెడ్డి గ్రామానికి చెందిన బైండ్ల చిన్నరాజు కుమారుడు సిద్దిరాముడు ఈ నెల 5న ఉదయం బస్టాండ్ సమీపంలో తప్పిపోగా కుటుంబంతో సహా బస్టాండ్ ఎదురుగా ఉంటున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా ప్రధాన రహదారిపై ఉన్న దుకాణాలు తదితర ప్రాంతాల్లో సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు.

11న జూనియర్ కబడ్డీ సెలక్షన్స్

ఆలేరురూరల్ : సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ జిల్లా సెలక్షన్ పోటీలను ఈ నెల 11న ఆలేరు పట్టణంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ ప్రధాన కార్యదర్శి పూల నగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సెలక్షన్ పోటీల్లో పాల్గొనే ఆసక్తి క్రీడాకారులు ఆదివారం పాఠశాల మైదానంలో హాజరు కాగలరన్నారు. సెలక్ట్ అయిన క్రీడాకారులు ఈనెల 16 నుంచి 19 వరకు సూర్యాపేట జిల్లాలోని చింతలపాలెం గ్రామంలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మునగాల(కోదాడ): ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన ముస్కుల వీరశేఖర్(40) నడిగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కాగా, వీరశేఖర్ వివిధ చిట్‌ఫండ్ సంస్థల్లో అప్పులు తీసుకొని తిరిగి కట్టలేక మనస్తాపానికి గురై గత నెల 27రాత్రి పురుగుల మందు తగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు ఖమ్మం పట్టణంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లోకేష్ తెలిపారు.

అదుపుతప్పి లారీ బోల్తా

మాడుగులపల్లి : లారీ అదుపుతప్పి బోల్తాపడిన ఘటన మండల కేంద్రంలోని టోల్‌గేట్ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నుంచి ఉల్లిగడ్డల లోడ్ లారీ ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు బయల్దేరింది. మాడుగులపల్లి టోల్‌ప్లాజా దాటగానే అదుపుతప్పి రోడ్డు దిగువకు దూసుకెళ్లి పల్టీకొట్టింది. ప్రమాదం నుంచి డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు. డ్రైవర్ నిద్రమత్తే ప్రమాదానికి కారణమని సమాచారం. ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

అనాథాశ్రమంలో వృద్ధురాలి అప్పగింత



వృద్ధురాలిని స్థానికుల సాయంతో అనాథాశ్రమానికి తీసుకెళ్తున్న నవీన్ ఠాగూర్

యాదగిరిగుట్ట : నడవలేని స్థితిలో ఉన్న ఓ వృద్ధురాలిని నవీన్ ఠాగూర్ అనే యువకుడు భువనగిరి మండలం రాయగిరిలో ఉన్న అనాథాశ్రమంలో చేర్పించాడు.హైదరాబాద్‌లోని ఉప్పల్ గూడకు చెందిన ఆశ అనే వృద్ధురాలు ఆరేళ్ల క్రితం యాదగిరిగుట్టకు వచ్చింది. ఇక్కడే భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తోంది. భిక్షాటన చేస్తున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఆమెను ఢీకొట్టడంతో గాయపడి నడవలేని స్థితిలో ఉంది. స్థానిక తులసీ కాటేజీ సమీపంలో ఉన్న వృద్ధురాలిని నవీన్ ఠాగూర్ గమనించి చేరదీశాడు. స్నేహితుల సహాయంతో ఆమెను రాయగిరిలోని అనాథాశ్రమంలో చేర్పించారు. వృద్ధురాలి వద్ద కొంత నగదు ఉండగా ఆశ్రమ నిర్వాహకులకు అందజేశారు. బాధితురాలి కుటుంబీకులు వస్తే అప్పగించాలని కోరారు.

మట్టపల్లిలో నిత్య కైంకర్యాలు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం నిత్యకైంకర్యాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం జరిపారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సం చేపట్టారు. ఆ తర్వాత విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్క పూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలతో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. అనంతరం క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామికి తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లి రావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు అద్దేపల్లిలక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి పాల్గొన్నారు.

అర్హత ఉన్నా అనర్హులుగానే..!

- వైద్య శాఖలో ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులకు 'బ్రిడ్జి కోర్సు' నిబంధన
- 2020 తరువాత బ్రిడ్జి కోర్సును సబ్జెక్టుగా చేర్చిన వైనం
- అంతకుముందు బీఎస్సీ నర్సింగ్, జీఎన్‌ఎం పూర్తిచేసిన వారి పరిస్థితి అగమ్య గోచరం



మిర్యాలగూడ అర్బన్: 2020 కంటే ముందు బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం పూర్తి చేసిన అభ్యర్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఎన్నో ఆశలతో ఆ కోర్సులు చేసిన వారు.. వైద్య శాఖాధికారుల నిర్ణయంతో గందరగోళంలో పడిపోయారు. వైద్య శాఖలో ఇటీవల ఎంఎల్‌హెచ్‌పి (మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్) ఉద్యోగాల కోసం ఆయా జిల్లా వైద్యాధికారులు భర్తీ చేసేవిధంగా ఉత్తర్వులు ఇచ్చారు. దానిలో భాగంగా బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం పూర్తి చేసిన వారు మరో ఆరు నెలల బ్రిడ్జి కోర్సు కూడా పూర్తి చేసి ఉండాలని నిబంధన విధించారు. దీంతో అసలు అప్పటి వరకు బ్రిడ్జి కోర్సు అంటే తెలియని వీరు ఆందోళనలోపడ్డారు. ఇప్పుడు కేవలం రెగ్యులర్ అభ్యర్థులకే బ్రిడ్జి కోర్సు అందుబాటులో ఉంది. గతంలో నర్సింగ్, జీఎన్ఎం పూర్తిచేసిన వారికి బ్రిడ్జి కోర్సు చేసే అవకాశం లేదు. దీంతో వారు ఎంఎల్‌హెచ్‌పి ఉద్యోగాలకు దూరం కావాల్సి వస్తోంది. 2020 తరువాత బ్రిడ్జి కోర్సును బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎంలలో ఒక సబ్జెక్టుగా చేర్చారు. దీంతో 2020 తరువాత ఆ కోర్సులు చేసిన వారికి ఎలాంటి ఇబ్బందీ లేదు. కానీ, అంతకంటే ముందు ఆ కోర్సులు పూర్తి చేసిన వారికి ఎలాంటి ప్రత్యామ్నాయం చూపాలనే.. ముందు చూపు వైద్యశాఖాధికారులకు లేకపోవడం శోచనీయం. ఈ కొత్త నిబంధనలతో ఎంఎల్‌హెచ్‌పి పోస్టులు సైతం పూర్తిగా నింపలేని పరిస్థితి ఏర్పడగా ఇప్పటికి అనేక పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిసింది. ఏ ప్రభుత్వ ఉద్యోగాలకు బ్రిడ్జికోర్సు పెట్టని నిబంధన కేవలం ఎంఎల్‌హెచ్‌పి పోస్టులకు మాత్రమే ఎందుకు పెట్టారని పలువురు ప్రశ్నిస్తున్నారు. బ్రిడ్జి కోర్సుతో సంబంధం లేకుండా తమకు కూడా ఎంఎల్‌హెచ్‌పి ఉద్యోగాలకు అవకాశం కల్పించాలని, లేకుంటే 2020 కంటే ముందు బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం పూర్తి చేసిన అభ్యర్థులందరికి బ్రిడ్జి కోర్సును నిర్వహించి ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని అభ్యర్థులు కోరుతున్నారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే భర్తీ చేస్తాం

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఎంఎల్‌హెచ్‌పి పోస్టులకు బ్రిడ్జి కోర్సు ఉన్న వారినే ఎంపిక చేశాం. 2020 తరువాత బీఎస్సి, జీఎన్ఎం పూర్తి చేసిన వారికి సబ్జెక్టుగా బ్రిడ్జి కోర్సును చేర్చారు. అయితే అంతకు ముందు కోర్సులు పూర్తి చేసినవారు మిగతా పోస్టులకు అర్హులే. ఈ ఒక్క పోస్టుకు మాత్రమే ఈ నిబంధన ఉంది.

– అనిమల్ల కొండల్‌రావు, డీఎంహెచ్ఓ, నల్లగొండ

మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ పూజ



మాట్లాడుతున్న రాష్ట్ర కన్వీనర్ పూజ

భువనగిరిటౌన్ : మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మక్కపల్లి పూజ, ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ అన్నారు. భువనగిరి జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ జిల్లా గరల్స్ కన్వెన్షన్‌ను శ్రీ గాయత్రి జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మాయిల బాల్య వివాల వల్ల దోపిడీ, హింసకు లైంగిక వేధింపులకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని అన్నారు. సమాజంలో లింగ వివక్షత కోసం ప్రతి ఒక్కరూ పోరాడాలని పిలుపునిచ్చారు. లింగ సమానత్వంపై ఐక్యంగా విద్యార్థి లోకమంతా పనిచేయాలన్నారు. అమ్మాయిలు ధైర్యంగా ఉండి వారి లక్ష్యాలను సాధించే దిశగా ప్రయాణం చేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకురాలు కుకూట్ల శివాని,కొలుపుల సహనా, సిరికొండ భవ్య, చేగురి పూజ, అప్పం పల్లవి, జంపాల ప్రణతి, నర్మదా, గుగ్గిళ్ళ నేహా, ఆకుల కావ్య ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు బుగ్గ ఉదయ్, రాయోజు రమణ, ఎంబాడీ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూలీకి గాయాలు

మునుగోడు: ట్రాక్టర్ చక్రం కాలు పైనుంచి వెళ్లడంతో ఉపాధిహామీ కూలీకి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని పలివెల గ్రామంలో చోటు చేసుకుంది. మునుగోడు మండలంలోని పలివెల గ్రామానికి చెందిన ఉపాధిహామీ కూలీ జయమ్మ రోజువారీగా శుక్రవారం తమ గ్రామంలోని చెరువులో జరుగుతున్న పూడిక తీత కూలీ పనులకు వెళ్లింది. చెరువులో తవ్విన మట్టిని ట్రాక్టర్‌లో లోడు చేయగా అది దిగబడడంతో కూలీలు అంతా కలసి నెట్టుతున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా ట్రాక్టర్ ముందుకు కదలడంతో జయమ్మ కాలుపై నుంచి వెళ్లింది. దీంతో కాలు విరిగిపోవడంతో తోటి కూలీలు చికిత్స నిమిత్తం మునుగోడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జడ్పీటీసీ నల్లపాటి ప్రమీలపై అనర్హత వేటు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాములు

- హుజూర్‌నగర్ కోర్టు తీర్పు ఇచ్చిందని వెల్లడించిన సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బుర్రి శ్రీరాములు

మునగాల: మునగాల మండల జడ్పీటీసీ సభ్యురాలుగా కొనసాగుతున్న నల్లపాటి ప్రమీలను అనర్హురాలిగా ప్రకటిస్తూ హుజూర్‌నగర్ సెషన్స్ కోర్టు తీర్పు వెల్లడించిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బుర్రి శ్రీరాములు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019లో మునగాల జడ్పీటీసీ స్థానానికి టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా నల్లపాటి ప్రమీల పోటీ చేసి గెలుపొందారని తెలిపారు. అదే ఎన్నికల్లో పోటీ చేసిన అఖిలపక్షాల ఉమ్మడి అభ్యర్థి దేశిరెడ్డి జ్యోతి ఓటమి పాలయ్యారని పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలు విడుదలైన తర్వాత నల్లపాటి ప్రమీల ఎన్నికను సవాల్ చేస్తూ జ్యోతి కోర్టును ఆశ్రయించిందని తెలిపారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం1995తర్వాత ఇద్దరి కన్న ఎక్కువ మంది సంతానం కలిగి ఉన్నారని, నల్లపాటి ప్రమీల పోటీకి అనర్హురాలని కోర్టుకు వివరించిందని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా తప్పుడు నామినేషన్ దాఖలు చేసి ఎన్నికైన ప్రమీలను తొలగించాలని , ఆమెకు వాస్తవంగా ముగ్గురు సంతానం ఉన్నారని కోర్టులో పిటీషన్ దాఖలు చేశారని తెలిపారు. కేసును స్వీకరించిన డివిజనల్ మెజిస్ట్రేట్ విచారణ చేపట్టి తీర్పు వెల్లడించారని, విచారణ పూర్తయ్యాక అన్ని రకాల ఆధారాలను కోర్టులో జ్యోతి సమర్పించడంతో ఈ కేసులో జెడ్పీటీసీ ఎన్నికల ఫలితాల్లో రెండవ స్థానంలో ఉన్న జ్యోతిని జెడ్పీటీసీ సభ్యురాలిగా కొనసాగాలని కోర్టు తీర్పు వెల్లడించిందని శ్రీరాములు తెలిపారు. దీంతో సీపీఎం పార్టీ శ్రేణులు స్వీట్లు పంపిణీ చేశారు. సమావేశంలో సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, పార్టీ మండల కార్యదర్శి చందా చంద్రయ్య మండల కార్యదర్శి వర్గ సభ్యులు బచ్చలకూరి స్వరాజ్యం పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు ప్రారంభం

- పోటీలను ప్రారంభించిన డీఈఓ నారాయణరెడ్డి, ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి
- విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని పిలుపు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు



క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న డీఈఓ నారాయణరెడ్డి, తదితరులు



ఖోఖో పోటీల్లో తలపడుతున్న వరంగల్, నిజామాబాద్ జట్ల క్రీడాకారులు

భువనగిరి : తెలంగాణ రాష్ట్ర స్థాయి సీనియర్ ఖోఖో ఛాంపియన్ షిప్ (2023–24) పోటీలు శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ప్రారంభమయ్యాయి. భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న పోటీలను డీఈఓ నారాయణరెడ్డి, తెలంగాణ ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు నిర్వహించుకోవడం సంతోషకరమన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు అభ్యసన ప్రక్రియతో పాటు క్రీడాకారులుగా తీర్చిదిద్దాలన్నారు. గ్రామీణప్రాంతాల్లోని క్రీడాకారులను వ్యాయామ ఉపాధ్యాయులు ప్రోత్సహించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే మొదటి సారిగా భువనగిరి మ్యాట్ పై ఖోఖో పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఖోఖో అసోసియేషన్ ఆద్వర్యంలో క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసి జాతీయ స్థాయిలో రాణించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అంతకు ముందు వివిధ ఉమ్మడి జిల్లాల ఖోఖో క్రీడాకారులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. మొదటి రోజు పది ఉమ్మడి జిల్లాలకు చెందిన ఖోఖో జట్ల మధ్య లీగ్ మ్యాచ్‌లను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ నరాల నిర్మల, జెడ్పీటీసీ బీరు మల్లయ్య, జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అదికారి ధనుంజయనేయులు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి స్టాలిన్‌బాబు, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాతి కృష్ణమూర్తి, వివిధ ఉమ్మడి జిల్లాల ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు, పీఈటీలు, పీడీలు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల కిడ్నాపర్లంటూ ప్రచారం

- కారులో వచ్చిన పలువురు దుండగులు
- చిక్కకుండా తప్పించుకున్న ముఠా

చౌటుప్పల్ : చౌటుప్పల్ మండలంలోని పలు గ్రామాల్లో పిల్లలను కిడ్నాప్ చేసే ముఠా సంచరిస్తుందన్న అంశం శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. మహీంద్రా జైలో వాహనంలో వచ్చిన కొంత మంది వ్యక్తులు మండల పరిధిలోని జైకేసారం గ్రామ శివారులో సంచరించారు. పరిసర ప్రాంతాలకు చెందిన గ్రామస్తులు, రైతులు వారిని గమనించారు. అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో ఇతరులకు సమాచారం చేరవేశారు. ఆ క్రమంలో కొంత మంది అక్కడకు చేరుకున్నారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న వాహనం, అందులోని వ్యక్తుల గురించి తెలుసుకునేందుకు దగ్గరకు వెళ్లే ప్రయత్నం చేశారు. గ్రామస్తులను గమనించిన అనుమానాస్పద వ్యక్తులు వాహనాన్ని స్టార్ట్ చేసుకొని అక్కడి నుండి వేగంగా ఉడాయించారు. అంతే వేగంతో చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని వలిగొండ రోడ్డులోకి శుక్రవారం సాయంత్రం వేళలో ప్రవేశించారు. జైకేసారం నుంచి అందిన సమాచారం మేరకు ఇక్కడి యువకులు కొందరు వాహనాన్ని వెంబడించారు. పట్టుకునేందుకు ప్రయత్నించారు. అయితే హైవేపైకి వెళ్తే దొరికిపోతామన్న ఆలోచనతో యువకులకు చిక్కకుండా సందుల్లో, గొందుల్లో నుంచి వాహనాన్ని తిప్పి చాకచక్యంగా తప్పించుకొని పారిపోయారు. జైలో వాహనానికి ఉన్న నెంబర్ కూడా సరిగా కనిపించకుండా ఉంది. అయితే ఈ వాహనం, అందులోని వ్యక్తులు చిన్నపిల్లలను కిడ్నాప్ చేసే వ్యక్తులు కాదని, మేకలను ఎత్తుకెళ్లే ముఠాగా తేలింది.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

మేళ్లచెరువు : గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన గురువారం రాత్రి మేళ్లచెరువు మండలకేంద్రం శివారులో చోటుచేసుకుంది. మేళ్లచెరువు మండలంలోని వెల్లటూరు గ్రామానికి చెందిన సదరు వెంకటేశ్వర్లు (36) కల్లు గీత కార్మికుడు. రాత్రి కల్లు గీసుకొని మేళ్లచెరువు నుంచి ఇంటికి వెళుతుండగా కోదాడ –మేళ్లచెరువు రోడ్డులో వెనుకనుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని కోదాడకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య ,ఇద్దరు పిల్లలున్నారు. భార్య వెంకట్రావమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆటో, బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

మేళ్లచెరువు : ఆటో, బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం మేళ్లచెరువు మండలకేంద్రం పరిధిలో చోటు చేసుకుంది. హుజూర్‌నగర్ మండలం వేపలసింగారం నుంచి కూలీలను ఎక్కించుకొని వస్తుండగా మండంలోని కందిబండ గ్రామపంచాయతీ పరిధిలోని గాంధీనగర్ తండా గ్రామానికి చెందిన పాల్తీయా శ్రీను,పానుగోతు హేమ్లా వేపలమాధవరం గ్రామానికి బైక్ పై వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో మేళ్లచెరువు శివారులో ఎదురుగా వస్తున్న బైక్‌ను కూలీలతో వెళుతున్న ఆటో వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్ వస్తున్న ఇరువురికి స్వల్ప గాయాలయ్యాయి.

ఇనుపరాడ్లను విక్రయిస్తున్న ముగ్గురిపై కేసు

చౌటుప్పల్ : లారీలో ఇనుపరాడ్ల లోడ్ వేసుకొని గమ్యస్థానానికి చేరకుముందే మార్గమధ్యలోనే డ్రైవర్ రాడ్లను విక్రయించే ప్రయత్నం చేయగా పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన శుక్రవారం మండల పరిధిలోని పంతంగి టోల్‌ప్లాజా దాటాక రెడ్డిబావి గ్రామం వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట మండలం సింగారం గ్రామానికి చెందిన గండికోట నరేష్ లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని ఏజాజ్‌నగర్‌లో బోడ శ్రీను అనే వ్యక్తి ఆదేశాల మేరకు ఇనుపరాడ్లను లోడ్ చేసుకున్నాడు. భద్రాద్రికొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం ముక్కామిడి గ్రామానికి వెళ్లేందుగాను వేబిల్లు తీసుకున్నాడు. ఆ క్రమంలో చౌటుప్పల్ మండల పరిధిలోని పంతంగి టోల్‌ప్లాజా దాటాక తనకు పరిచయస్తుడైన చిట్యాల మండల కేంద్రంలో వెల్డింగ్ దుకాణం నిర్వహించే చౌటుప్పల్ మండలంలోని రెడ్డిబావి గ్రామానికి చెందిన రేపాక యాదయ్య, అదే గ్రామానికి చెందిన వ్యవసాయదారుడైన పల్లె శేఖర్‌ల వద్ద లారీని ఆపాడు. వారితో బేరం కుదుర్చుకున్నాడు. అనంతరం లారీలోని ఇనుపరాడ్లను దింపాడు. అదే సమయంలో పెట్రోలింగ్ విధుల్లో ఉన్న పోలీసులు గమనించారు. దగ్గరకు వెళ్లి విషయాన్ని గుర్తించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. విచారించగా లారీలోని టన్ను విలువగల రాడ్లను తీసినట్టుగా అంగీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

రాజాపేట : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. హైదరాబాద్‌లోని జగద్గిరిగుట్టకు చెందిన ఎడ్ల భూపాల్‌రెడ్డి (65) ఈనెల 2న జాల గ్రామంలోని బంధువ లక్ష్మారెడ్డి ఇంటికి వచ్చాడు. అదే రోజు బైక్‌పై వెళ్తూ కిందపడడంతో గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందాడు.

వ్యక్తిపై కేసు నమోదు

చౌటుప్పల్ : జాతీయ రహదారిపై వెళ్తున్న వాహనాల వద్ద తక్కువ ధరకు డీజిల్‌ను కొనుగోలు చేసి స్థానికంగా ట్రాక్టర్ యజమానులకు అధిక ధరకు విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశామని సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు. చౌటుప్పల్ మండల పరిధిలోని రెడ్డిబావి గ్రామానికి చెందిన నందగిరి మహేష్ అదే గ్రామం వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు గురువారం అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. అప్పటికే అతని వద్ద నాలుగు డీజిల్ క్యాన్లలో 80లీటర్ల డీజిల్ ఉంది. ఈ విషయమై విచారించగా హైవేపై రాకపోకలు సాగించే వాహనాల వద్ద తక్కువ ధరకు డీజిల్‌ను కొనుగోలు చేసి స్థానికంగా ఉన్న ట్రాక్టర్ యజమానులకు అధిక ధరకు అమ్ముతున్నట్టుగా అతను అంగీకరించాడు. ఈ మేరకు కేసు శుక్రవారం కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

మెడికల్ కళాశాలను తరలిస్తే ఊరుకోం



రాస్తారోకో చేస్తున్న బీజేవైఎం నాయకులు

భువనగిరి : యాదగిరి గుట్టకు మంజూరైన మెడికల్ కళాశాలను మరో ప్రాంతానికి తరలిస్తే ఊరుకోమని బీజేవైఎం జోనల్ ఇంచార్జి పట్నం కపిల్ అన్నారు. శుక్రవారం మెడికల్ కళాశాలను మరో ప్రాంతానికి తరలించడానికి చేస్తున్న ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు మంజూరైన మెడికల్ కళాశాలను సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కేంద్రానికి తరలించే ప్రయత్నం చేస్తున్న జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ఏమి పట్టనట్లు వ్యవహరించడం సరికాదన్నారు. గత ప్రభుత్వం జిల్లాకు కళాశాలను కేటాయిస్తే కాంగ్రెస్ ప్రభుత్వ తరలించడం ఎంత వరకు న్యాయంగా ఉంటుందని ప్రశ్నించారు. మా మెడికల్ కళాశాల మాకే కావాలనే నినాదంతో కళాశాలను తరిగి కాపాడుకుంటామని హెచ్చరించారు. మెడికల్ కళాశాలను తరలిస్తే ఆలేరు, భువనగిరి ఎమ్మెల్యేల ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్‌రెడ్డి,కౌన్సిలర్ రత్నపురం బలరాం,బీజేవైఎం రాష్ట్ర, జిల్లా నాయకులు దిండు భాస్కర్, దయ్యాల కుమారస్వామి, మణికంఠ, రాజశేఖర్‌రెడ్డి,వాసం నర్సింగ్‌రావు,రమేష్, సదా అనందం, ఉమాశంకర్‌రావు, వైజయంతి, మల్లీకా, శ్యాంసుందర్, విజయకుమార్, శ్రీనివాస్, జనగాం నర్సింహా చారి, శ్రీనివాస్‌రెడ్డి, రత్నపురం శ్రీశైలం, భిక్షపతి, మల్లికార్జున్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ భారతీయుడే కాదు

- మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్



మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ తదితరులు

చౌటుప్పల్ : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ భారతీయుడే కాదని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు.మాజీ ప్రధానమంత్రి పీవీనరసింహారావుకు భారతరత్న పురస్కారాన్ని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెంలో శుక్రవారం ప్రధాని మోదీ, పీవీనరసింహారావుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అదే విధంగా కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాహుల్‌గాంధీ గతంలో కూడా మోదీ కులం విషయంలో ఇష్టానుసారంగా మాట్లాడారని ధ్వజమెత్తారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 10–12 స్థానాలను కైవసం చేసుకుంటుందన్నారు. కేఆర్ఎంబీ విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలవి నాటకాలని విమర్శించారు. ఆరు గ్యారంటీలను తప్పించుకునే క్రమంలోనే కాంగ్రెస్ నేతలు చిల్లర రాజకీయాలకు తెరలేపారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా టెలికాం అడ్వయిజరీ బోర్డు సభ్యుడు రమనగోని శంకర్, కౌన్సిలర్ పోలోజు శ్రీధర్‌బాబు, నాయకులు గుజ్జుల సురేందర్‌రెడ్డి, ఆలె చిరంజీవి, పాలకూర్ల జంగయ్య, ఊడుగు యాదయ్య, దాసోజు భిక్షమాచారి, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, కాసుల వెంకటేశం, పిల్ల బుచ్చయ్య, ఊదరి రంగయ్య, బండారు మహేందర్‌రెడ్డి, ఎర్ర గణేష్, పర్నె శ్రీనురెడ్డి, సప్పిడి లింగారెడ్డి, ఉష్కాగుల నాగరాజు, పర్నె శేఖర్‌రెడ్డి, లింగస్వామి, సందగళ్ల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

తూర్పు మాఢ వీధిలో కొబ్బరికాయ మొక్కులు

- అందుకు ఏర్పాట్లు చేస్తున్న ఆలయ అధికారులు
- ప్రస్తుతం విష్ణు పుష్కరిణి వద్ద కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు



తూర్పు రాజగోపురం ముందు క్యూలైన్ వద్ద పరిశీలిస్తున్న అధికారులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులకు సరైన సౌకర్యాలు కల్పించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కొండపైన శ్రీస్వామి వారి సన్నిధిలో భక్తులు మొక్కు కొబ్బరికాయలు కొట్టేందుకు వీలు కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా తూర్పు రాజగోపురం ముందున్న గోల్డెన్ క్యూలైన్ ప్రాంతాన్ని ఆలయాధికారులు శుక్రవారం పరిశీలించారు. ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభంకాక ముందు తూర్పు రాజగోపురం నుంచి ఆలయంలోకి వెళ్లే వెండి ద్వారం సమీపంలో, ధ్వజస్తంభం ఎదుట భక్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులను తీర్చుకునే వారు. ప్రధానాలయ పునర్నిర్మాణం పనులు ప్రారంభం అయ్యాక.. తాత్కాలికంగా బాలాలయాన్ని నిర్మించారు. ఈ బాలాలయంలో భక్తులు శ్రీస్వామిని దర్శించుకున్న తరువాత పడమటి దిశలో తమ మొక్కులో భాగంగా కొబ్బరికాయలను కొట్టారు. ఆలయ సన్నిధితో పాటు విష్ణు పుష్కరిణి సమీపంలో ఆంజనేయస్వామి ఆలయం ముందు, శివాలయంలో భక్తులు కొబ్బరికాయలు కొట్టే వారు.

ప్రధానాలయం ప్రారంభం అయ్యాక..

యాదాద్రీశుడి ప్రధానాలయంలో భక్తులకు దర్శనాలు పునఃప్రారంభం అయ్యాక భక్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకునే సంప్రదాయాన్ని ఆలయ మాఢ వీధి, అలయం నుంచి దూరం చేశారు. శ్రీస్వామిని దర్శించుకున్న తరువాత భక్తులు విష్ణు పుష్కరిణి వద్ద ఏర్పాటు చేసిన స్థలంలోనే కొబ్బరికాయలు కొట్టేందుకు వీలు కల్పించారు. దీంతో భక్తుల మనోభావాలు దెబ్బతినడంతో పాటు మొక్కులు చెల్లించుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అంతే కాకుండా భక్తుల తమ వెంట తీసుకువచ్చిన కొబ్బరికాయలను ఆలయంలోకి తీసుకెళ్లకుండా తూర్పు ద్వారం ముందే పెట్టించారు. దీంతో భక్తులు అధికారుల తీరుపై తీవ్ర అభ్యంతరాలను వ్యక్తం చేశారు.

బ్రేక్ దర్శనం భక్తులు కొబ్బరికాయ ఎక్కడ కొట్టాలి..

శ్రీస్వామి వారిని సులువుగా దర్శించుకునేందుకు ఆలయాధికారులు ఉదయం, సాయంత్రం బ్రేక్ దర్శనాలు కల్పిస్తున్నారు. బ్రేక్ దర్శనానికి భక్తులు నేరుగా లిఫ్టు, ఆలయ ఉత్తర దిశలోని సీసీ ర్యాంప్ నుంచి వస్తారు. ఇక్కడి నుంచి వచ్చిన భక్తులకు తూర్పు రాజగోపురం ముందు గోల్డెన్ క్యూలైన్ లోకి వెళ్లి కొబ్బరికాయలు కొట్టేందుకు వీలు పడదు. దీంతో బ్రేక్ దర్శనం భక్తులకు ఇబ్బందులు ఎదురయ్యేలా ఉన్నాయి. అందరికి అందుబాటులో ఉండేలా ఉత్తర రాజగోపురం ముందు ఉన్న గ్రీనరీ ఏర్పాటు చేసిన ఖాళీ స్థలంలో కొబ్బరి కాయలు కొట్టేందుకు వీలు కల్పిస్తే బాగుంటుందని పలువురు భక్తులు అంటున్నారు.

తూర్పు రాజగోపురం ఎదుటే..

కొండపైన తూర్పు రాజగోపురం ముందు గల గోల్డెన్ క్యూలైన్‌లో భక్తులు తమ మొక్కు కొబ్బరికాయలు కొట్టేందుకు వీలు కల్పించనున్నారు. ధర్మ దర్శనం, రూ.150 టిక్కెట్ పై శ్రీస్వామిని దర్శించుకునే భక్తులు తూర్పు రాజగోపురం ముందు గల క్యూలైన్ లో కొబ్బరికాయలు కొట్టి శ్రీస్వామిని దర్శించుకోనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను త్వరలోనే పూర్తి చేయనున్నారు.